క్లుప్తంగా

పచ్చదనానికి ప్రాధాన్యం


మొక్క నాటుతున్న రమేశ్

నారాయణఖేడ్: మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షిస్తూ ఏరియా ఆస్పత్రి పచ్చదనానికి మారుపేరుగా మార్చేందుకు అందరం భాగస్వామ్యంతో కృషిచేస్తామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేశ్ తెలిపారు. ఆసుపత్రి ఆవరణలో శనివారం వనమహోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. పొదలు, పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించి చదును చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ వైద్యులతో కలిసి మొక్కలు నాటారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేతకీకి చేరుకున్న పాదయాత్రీకులు


పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

ఝరాసంగం(జహీరాబాద్): ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలం మహా క్షేత్రానికి పలువురు భక్తులు పాదయాత్రగా వెళ్తున్నారు. వారు శనివారం కేతకీ సంగమేశ్వర ఆలయానికి చేరుకున్నారు. మహారాష్ట్రలోని ఔరాద్ నుంచి వారు పాదయాత్రగా వెళ్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. 12రోజుల పాటు సుమారు 500కిలోమీటర్లకుపైగా పాదయాత్ర సాగుతుందని తెలిపారు.

పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కమిషనర్


జహీరాబాద్ కోర్టు ప్రాంతంలో పనులు పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పలు వార్డుల్లో శనివారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి పర్యటించారు. పట్టణంలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నామని చెప్పారు. ప్రతి రోజు కార్మికులతో చెత్తాచెదారం తొలగించే పనులు చేయిస్తూ మురికి కాల్వలను శుభ్రం చేస్తున్నారు. ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఆయన వెంట శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సంధ్యారాణి, సిబ్బంది రవిందర్ రెడ్డి ఉన్నారు.

వైద్యశిబిరానికి స్పందన


శిబిరంలో పాల్గొన్న సిబ్బంది

ములుగు(గజ్వేల్): పెద్ద ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు చేయించుకోలేని పేదలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఆదుకుంటున్నాయని కేబీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొన్యాల బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని వాగునూతిలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన శిబిరంలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోను ఉచిత వైద్య సేవలందించాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీనాథ్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేచరేణిలో 'కనువిప్పు'

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని వేచరేణిల కొమురవెల్లి పోలీసులు కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో సీఐ ఎల్.శ్రీను మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పిల్లలపై తల్లిదండ్రులు పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. బ్యాంకు అధికారులమని, రుణమాఫీ వచ్చిందని, కరెంట్ బిల్లు కట్టాలని, కేవైసీ అప్డేట్ చేయాలని వచ్చే కాల్స్, లింక్‌లపై జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930కి కాల్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో కళా బృందం సభ్యులు బాలు, రాజు, తిరుమల, తెలంగాణ సాంస్కృతిక సారధి బృందం సభ్యులు శ్యాంసుందర్, కనకయ్య, హరిప్రసాద్, భిక్షపతి పాల్గొన్నారు.

ఆటలాడేదెలా?

- అధ్వానంగా అంబేడ్కర్ స్టేడియం
- పాడైన క్రీడా పరికరాలు
- విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు
- మైదానంలో పిచ్చిమొక్కలు దర్శనం
- పట్టించుకోని అధికారులు


స్టేడియం గ్రౌండ్ లో కూలిన ప్రహరీ

సంగారెడ్డి రూరల్ : పట్టణంలోని అంబేడ్కర్ స్టేడియంలో సరైన వసతులు లేక క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారు. క్రీడా పరికరాలు పాడై, మౌలిక సదుపాయాల లేకపోవడంతో ఆటలు ఆడలేని పరిస్థితి ఉంది. జిమ్‌లోని వస్తువులు ఉపయోగించలేకుండా ఉన్నాయి. దీంతో ఆ గదికి తాళం వేసేశారు. స్టేడియంలో కూడా పిచ్చిమొక్కలు పెరిగి జంతువులు తిరుగుతున్నాయి. జిల్లా కేంద్రంలో ఉన్న ఏకైక స్టేడియం ఇలా అధ్వానంగా ఉండటంతో ఆటగాళ్లు నిరుత్సాహానికి గురవుతున్నారు. గతంలో రోజూ వందలాది మంది క్రీడాకారులు సాధనకు వచ్చే వారు. నిర్వహణ లోపంతో స్టేడియం ఉనికిని కోల్పోతుంది. 15 ఏళ్లుగా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో స్టేడియం అభివృద్ధిని ఎవరూ పట్టించుకోవడం లేదు.


గ్రౌండ్ చుట్టూ ముళ్ల పొదలు, మురికి కూపం

వసతులు కరువు

స్టేడియంలో తాగునీరు, మూత్రశాలలు లేకపోవడంతో క్రీడాకారులు అవస్థలు పడుతున్నారు. కూర్చునే గ్యాలరీ కూడా పూర్తిగా దెబ్బతింది. స్టేడియంలో ఎక్కడ చూసినా అపరిశుభ్రత, పిచ్చి మొక్కలు పెరిగి జంతువులు సంచరిస్తున్నాయి. ఏ


పాడైన ఆట పరికరాలు


గ్రౌండ్లో పిచ్చి మొక్కలు

వైపు నుంచి విష పురుగులు వస్తాయని ఆటగాళ్లు భయాందోళనకు గురవుతున్నారు. స్టేడియానికి విద్యుత్ సౌకర్యంగా కూడా లేదు. ప్రహరీ పూర్తిగా కూలిపోయింది. చీకటైతే చాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతుంది. సరైన సౌకర్యాలు లేకపోవడంతో రాష్ట్ర, జిల్లాస్థాయి క్రీడా పోటీలకు సంబంధించిన ఎంపికలు కూడా నామమాత్రంగానే నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి అంబేడ్కర్ స్టేడియాన్ని అభివృద్ధి చేసి, ఆధునీకరణకు చర్యలు తీసుకోవాలని క్రీడాకారులు కోరుతున్నారు.

కరెంట్ లేదు

మేము నిత్యం స్కూల్‌కి వెళ్తాం. సాయంత్రం ఐదు ఆరు గంటల ప్రాంతంలో గ్రౌండ్‌కు వస్తాం. వచ్చిన వెంటనే చీకటి కావడంతో చేసేదేమీ లేక ఇంటికి వెళ్తున్నాం. లైట్స్ ఉంటే కాసేపు ఆడుకునే వీలుంటుంది.


– ముస్తాక్, యువకుడు

మరమ్మతులు చేపట్టాలి

గ్రౌండ్ పూర్తిగా పాడైపోయింది. ప్రతిరోజు మేము ఆడుకోవడానికి ఇక్కడికి వస్తాం. ఇక్కడ సరైన వసతులు లేకపోవడంతో ఆటలు ఆడలేక పోతున్నాం. ప్రభుత్వం, అధికారులు వెంటనే చొరవ చూపి గ్రౌండ్‌ను బాగు చేయాలి.


– షఫీ, విద్యార్థి

ఫార్మా కంపెనీల ఏర్పాటు వద్దు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలో ఫార్మా కంపెనీల ఏర్పాటును వెంటనే విరమించుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని రత్నాపూర్, వడ్డి, డప్పూర్, మల్గి తదితర గ్రామాల్లో నాయకులతో పర్యటించి రైతులతో మాట్లాడారు. అనంతరం రత్నాపూర్‌లో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వడ్డి, మల్గి, డప్పూర్ తదితర గ్రామాల పరిధిలోని రెండు వేల ఎకరాల్లో ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని.. ఫలితంగా ఇక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. కంపెనీల ఏర్పాటును ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ విజేందర్‌రెడ్డి, జిల్లా ఓబీసీ


రత్నాపూర్‌లో రచ్చబండ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మోర్చా అధ్యక్షుడు శివాజీరావు పాటిల్, మండల పార్టీ అధ్యక్షుడు ఓంకార్ యాదవ్ నాయకులు మల్లేష, శ్రీనివాస్ గుప్త, అడివిరెడ్డి, కాశీనాథ్, పురుషోత్తంరెడ్డి, విజయ్ పాటిల్, వీర్‌శెట్టి, రాజు, శ్రీధర్, మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి నమూనాల సేకరణ


ప్రజలతో మాట్లాడుతున్న అధికారులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హుస్సెళ్లి, న్యాల్‌కల్ గ్రామాల్లో మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా అయ్యే నీటి నమూనాలను శనివారం అధికారులు సేకరించారు. ఉదయం జహీరాబాద్ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ సాబేర్ హుస్సేన్‌తో కలిసి బృందం సభ్యులు నవీన్‌కుమార్ తదితరులు గ్రామాల్లో పర్యటించారు. మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా అయ్యే నీరు ఎలా ఉంది? ప్రతి రోజు నీరు వస్తున్నాయా? లేదా? తదితర విషయాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సేకరించిన నీటిని నాణ్యతా పరిశీలన కోసం ల్యాబ్‌లకు పంపుతున్నట్లు తెలిపారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి ధన్‌రాజ్, సిబ్బంది మల్గి కిష్టన్న తదితరులు ఉన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తప్పనిసరి


తెల్లాపూర్‌లో ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్న అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో శనివారం ఫైలేరియా, నూలిపురుగుల నిర్మూలన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, డాక్టర్ సునంద, డాక్టర్ శ్యామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈనెల 25 వరకు ఫైలేరియా, నూలిపురుగుల నిర్మూలన మందులను ఉచితంగా ఇంటింటికి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే జీహెచ్ఎంసీ పరిధిలోని రామచంద్రాపురం, భారతినగర్ డివిజన్ పరిధిలోని ఆరోగ్యం కేంద్రాల్లో జరిగిన కార్యక్రమాల్లో కార్పొరేటర్‌లు పుష్పనగేశ్, వెన్నవరం సింధుఆదర్శ్ రెడ్డిలు పాల్గొన్ని ఫైలేరియా మందులను పంపిణీ చేశారు.

వైద్యుడు లేక ఇబ్బంది


ఖాళీగా ఉన్న ఆర్థోపెడిక్ డాక్టర్ రూం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఆర్థోడిటిక్ వైద్యుడు లేక వైద్యం చేయించుకునేందుకు వచ్చిన జనం వెను తిరుగుతున్నారు. గతంలో ప్రభుత్వ ఆస్పత్రిలో ఇద్దరు ఆర్థోపెడిక్ వైద్యులు అందుబాటులో ఉండేవారు. ఒకరు గతేడాది ఆగస్టులో బదిలీపై జహీరాబాద్ వెళ్లారు. అప్పటి నుంచి ఆర్థోపెడిక్ డాక్టర్ జి.వినయ్ వైద్య సేవలు అందించారు. అయితే 15 రోజుల క్రితం ఆయన సైతం బదిలీపై తాండూర్ వెళ్లారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ వైద్యుడు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి ఆస్పత్రికి వైద్యుడిని కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్లాస్టిక్ రహిత గ్రామాలే లక్ష్యం

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): ప్లాస్టిక్ రహిత గ్రామాలే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పిలుపునిచ్చారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన 'ప్లాస్టిక్ రహిత భారత్ నిర్మాణం' కార్యక్రమంలో భాగంగా విలేజ్ బ్యాగ్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడం కోసం గ్రామాల్లో విలేజ్ బ్యాగులను ఏర్పాటు చేయడం ఎంతో ఉపయోగం అన్నారు. ప్లాస్టిక్‌కు బదులు నార, గుడ్డ సంచులను, పేపర్ కవర్లను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి భాస్కర్, మండల నోడల్ అధికారి అంజాగౌడ్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, వీఓ మహిపాల్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ గౌతమి, ఎర్త్ ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ ఆంజనేయులు, రాజు, నిహారిక, ప్రశాంత్, ఇమ్రాన్, విద్య, వాలంటీర్లు పాల్గొన్నారు.


విలేజ్ బ్యాగ్‌ను ప్రారంభిస్తున్న వెంకటయ్య

సంక్షిప్త వార్తలు

◆ **విద్యారంగం బలోపేతం చేయాలి**

నారాయణఖేడ్: ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కంబపురం అశోక్ డిమాండ్ చేశారు. సంఘం 50వ అవతరణ దినోత్సవం సందర్భంగా శనివారం నారాయణఖేడ్‌లోని సంఘం కార్యాలయ స్థలంలో ఉద్యమపతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కాశీనాథ్ జాదవ్, కార్యదర్శి యేశప్ప, జిల్లా, డివిజన్ బాధ్యులు హరిసింగ్, రాజు, రాములు, అంజయ్య, ఏసుదాస్, పంచాక్షరి, దేవదానం, హన్మాండ్లు, విఠల్, విష్ణు, గోవింద్, రవికుమార్ పాల్గొన్నారు.

◆ **శునకాల గణన పూర్తి**

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని 34 గ్రామ పంచాయతీల పరిధిలో వారం రోజుల్లో శునకాల గణన పూర్తి చేసినట్లు ఎంపీడీఓ సత్తయ్య తెలిపారు. ఇటీవల కాలంలో కుక్కల బెడద గ్రామాల్లో ఎక్కువగా కావడంతో పిల్లలపై, పశువులపై వాటి దాడులు ఎక్కువయ్యాయని, ఆ మేరకు నియంత్రణ దిశగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. మండలంలో 2,230 కుక్కలు ఉన్నట్లు సర్వేలో వెల్లడైందని పేర్కొన్నారు. అందులో సుక్కల్‌తీర్థ్‌లో అత్యధికంగా 233 ఉండగా, భీంరాలో 140 ఉన్నాయని అత్యల్పంగా నాగన్‌పల్లిలో 13 చందర్ తండాలో 27 ఉన్నట్లు తెలిపారు. సర్వేలో ఆడ, మగ, పిల్లలు, పెంపుడు కుక్కలు అన్నింటిని గణించినట్లు పేర్కొన్నారు.

◆ **ఆలయ నిర్మాణానికి విరాళం**

జహీరాబాద్ టౌన్: మండలంలోని అనేగుంటకు చెందిన తట్టు విశ్వనాథ్ యాదవ్ వంటలగడ్డ తండాలో నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి శనివారం లక్ష రూపాయల విరాళం అందజేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ సోదరుడు విశ్వనాథ్ గతంలో కూడా హనుమాన్ మందిరానికి లక్ష రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నారాయణ, తండా గిరిజన పెద్దలు మోతీరాం, సురేశ్, రాంశెట్టి, రాజు, మెంబర్ శెట్టి, గొల్ల జగన్నాథం, బర్దిపురం మహేశ్, గంటా శ్రీనివాస్, మెటల్ కుంట అశోక్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీఒక్కరిలో భక్తిభావం పెరగాలి

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: నియోజకవర్గంలో నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని, ప్రతీ ఒక్కరిలో దైవచింతన పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కృషి డిఫెన్స్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీఅభయాంజనేయ స్వామి హనుమాన్ దేవాలయంలో నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్ఠాపనకు శనివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 200 కు పైగా దేవాలయాలు నిర్మించడంతోపాటు, పరమత సహనం పాటిస్తూ మసీదులు, ఆశుర్ఖానాలు, చర్చిలు నిర్మించి ప్రతీఒక్కరిలో దైవచింతను పెంపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.


విగ్రహ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

నులి పురుగులను నివారిద్దాం


విద్యార్థులకు మాత్రలను అందజేస్తున్న కార్పొరేటర్ కుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నులి పురుగులు ఉంటే పిల్లల్లో పోషకహార లోపం, రక్తహీనత ఉంటుందన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు లయన్స్ క్లబ్ సభ్యులు జైపాల్, ప్రకాష్, జనార్దన్‌రెడ్డి, విశ్వనాథం, మతిన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే మాణిక్‌రావు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. జహీరాబాద్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన 13 మంది అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పతిలో చికిత్సపొందారు. ఆర్థిక సహాయం కోసం ఎమ్మెల్యే వద్ద దరఖాస్తు చేసుకోగా రూ.3.45 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు మాణిక్‌రావు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలోమాజీ ఆత్మ చైర్మన్‌లు విజయ్ కుమార్, పెంటారెడ్డి, సొసైటీ చైర్మన్ మచ్చేందర్, పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, పలు గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు చిన్న పటేల్, అబ్రహం, పర్వేజ్, మోహన్‌రెడ్డి, ఇస్మాయిల్, అమిత్‌కుమార్, విజయ్‌రాథోడ్, వాహీద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్: నారాయణఖేడ్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన ముగ్గురికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం చెక్కులను డీసీసీ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. కాంగ్రెస్ నాయకులు రాధాకిషన్, రఘుపతిరెడ్డి, భూమేష్, సంగమేశ్వర్, జనార్దన్, బలరాం పాల్గొన్నారు.


నారాయణఖేడ్: చెక్కు అందజేస్తున్న భూపాల్ రెడ్డి

నారాయణఖేడ్: నారాయణఖేడ్ మండలం చందర్ నాయక్ తండాకు చెందిన రాథోడ్ నారాయణకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.22,500 ఆర్థికసహాయం మంజూరైంది. ఇందుకు సంబంధించిన చెక్కును శనివారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తన చేతుల మీదుగా అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు పర్లాల్, కురుమ దత్తు, సంతోష్, దిగంబర్ పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌గా అవకాశమివ్వండి

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని గట్‌పల్లి మాజీ సర్పంచ్ జి. రమేశ్ శనివారం రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సి. దామోదర రాజనర్సింహను హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వట్‌పల్లి ఏఎంసీ చైర్మన్‌గా తమ కుటుంబానికి అవకాశం కల్పించాలని కోరారు. 15 ఏళ్లుగా కాంగ్రెస్ అధికారంలో ఉన్న లేకపోయినా సేవలందిస్తున్నానన్నారు. గ్రామంలోని ప్రతి కాంగ్రెస్ కార్యకర్తను కలుపుకొని మండల, నియోజకవర్గ నాయకులతో మమేకమై పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.


మంత్రిని దామోదరకు జ్ఞాపికను అందజేస్తున్న మాజీ సర్పంచ్ రమేశ్

వైభవంగా చండీ మహోత్సవం

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండలం బలకంచెల్క తండా (భక్తిధాం తండా)లో శనివారం 15వ మాస చండీ మహోత్సవం నిర్వహించారు. తండాలోని విశ్వపాళిని భవానీ సమేత సేవాలాల్ మహరాజ్ మహ మందిరంలో ధర్మకర్త, మేడ్చల్ జిల్లా రవాణాశాఖ అధికారి మూడ్ కిషన్ లలిత దంపతుల ఆధ్వర్యంలో యాగం చేపట్టారు. సిద్ధాంతి బ్రహ్మశ్రీ చంద్రమౌళీశ్వర శర్మ, వేదపండితులు అనూప్‌శర్మ, మందిరం ప్రధాన అర్చకులు మనోజ్‌శర్మ నేతృత్వంలో దేవత హోమాదులు, హారతి, ఇతర కార్యక్రమలు చేపట్టారు. కార్యక్రమంలో రూప్‌సింగ్, రాములు, శంకర్, సవాయ్‌సింగ్, మన్మోహన్‌నాయక్, కిషన్, జైల్‌సింగ్ పాల్గొన్నారు.

రేపు సిద్దేశ్వర ఆలయంలో యజ్ఞం

కంగ్టి(నారాయణఖేడ్): కంగ్టిలోని సిద్దేశ్వర ఆలయం రేపు నిర్వహించే శివ పంచాక్షరీ జపయజ్ఞం కార్యక్రమానికి ముస్తాబైంది. శ్రావణ సోమవారంను పురస్కరించుకొని ఫసల్‌వాదిలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠానికి చెందిన మహేశ్వర శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో యజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ నిర్వాహకులు దారం సౌమ్య సంజయ్‌కుమార్ తెలిపారు. రేపు నిర్వహించే యజ్ఞాల కోసం ఆలయ ప్రాగణంలో ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

పేరు మార్పు

నేను, ఎడ్ల శ్వేత రెడ్డి తెలియజేయునది ఏమనగా, నా పేరు పదవ తరగతి సర్టిఫికెట్ ప్రకారము వంటేరు శ్వేత మరియు పాత పాస్‌పోర్ట్ నం.H2716532లో కూడా వంటేరు శ్వేత అని ఉన్నది. ఇట్టి పేరును పెళ్ళి తరువాత ఎడ్ల శ్వేత రెడ్డి అని ఆధార్ ప్రకారము మార్చుకుంటున్నాను.

పరామర్శ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని కంబాలపల్లికి చెందిన బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు వంగపల్లి మల్లేశ్ కుటుంబాన్ని శనివారం పార్టీ మండల అధ్యక్షుడు పెద్దగొల్ల అంజన్నతో కలిసి ఎమ్మెల్యే కుమారుడు చింతా సాయినాథ్ పరామర్శించారు. మల్లేశ్ మాతృమూర్తి మాజీ వార్డు సభ్యురాలు లక్ష్మి ఇటీవల అనారోగ్యానికి గురై చనిపోయారు. శ్రీహరి, నరేశ్, సలవాద్దీన్ ఉన్నారు.